సాక్షి
బాపట్ల
మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



హోంగార్డులకు అభినందనలు


నగరంపాలెం: కానిస్టేబుళ్లుగా ఎంపికైన హోం గార్డులు సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఎస్పీ అభినందించారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,55,878 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 2,76,599 క్యూసెక్కులు వదులుతున్నారు.

మొక్కజొన్నలతో పూజలు



నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట టెలిఫోన్ ఎక్ఛేంజ్ సమీపంలో హెల్పింగ్ హ్యాండ్స్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలోని మహాకాళేశ్వర సహిత మహావీర గణపతికి సోమవారం 1108 మొక్కజొన్న కండెలతో సహస్ర అష్టోత్తర పూజ జరిపారు.

న్యూస్‌రీల్

13న జాతీయ లోక్‌అదాలత్



గుంటూరు లీగల్: ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేయడానికి ప్రయత్నం చేయాలని నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శరత్‌బాబు తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో సివిల్ జడ్జిలకు, పోలీస్ అధికారులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి వి.ఏ.ఎల్. సత్యవతి, మూడో అదనపు జిల్లా జడ్జి సీహెచ్.వెంకట నాగ శ్రీనివాసరావు, రెండో అదనపు జిల్లా జడ్జి వై.నాగరాజా, ఐదో జిల్లా జడ్జి స్పెషల్ కోర్ట్ ఫర్ ది ట్రయిల్ ఆఫ్ అఫెన్సెస్ అగైనెస్ట్ విమెన్ కె.నీలిమ పాల్గొన్నారు. ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి సలహాలు, సూచనలు చేశారు.

ఆధునిక వసతుల అంబులెన్స్ ప్రారంభం




గుంటూరు వెస్ట్: వెంటిలేటర్‌తోపాటు అత్యాధునిక సదుపాయాలతో అంబులెన్స్ ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో అంబులెన్స్‌కు జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రజల అత్యవసర చికిత్స కోసం అందించనున్న 190 వాహనాలలో మొదటిది అందిందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 24 అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయని, వీటిలో 15 బేసిక్ లైఫ్ సపోర్ట్ ఇచ్చేవి కాగా తొమ్మిది అడ్వాన్స్ సదుపాయాలు కలిగి ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బీవీ రంగారావు, ఎన్టీఆర్ జిల్లా వైద్య సేవా కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్. విజయ్ ప్రకాష్, 108 జిల్లా మేనేజర్ పి.బాలకృష్ణ పాల్గొన్నారు.

ఓవర్ బ్రిడ్జిపై ఇరుక్కుపోయిన వాహనం



తెనాలి రూరల్: తెనాలి ఓవర్ బ్రిడ్జి వద్ద సోమవారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గణేష్ నిమజ్జనం కోసం ఉపయోగించిన డీజే సౌండ్ సిస్టంలను తీసుకెళుతున్న ఓ వాహనం బ్రిడ్జి మొదట్లో నిలిచిపోయింది. ఫుట్‌పాత్, డివైడర్‌కు మధ్యలో వాహనం నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. అతికష్టం మీద వాహనాన్ని తొలగించాల్సి వచ్చింది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ అంతరాయంతో సుమారు గంటపాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వంతెనపై వాహన రాకపోకలను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన కాంక్రీట్ దిమ్మెలను పక్కకు జరిపి ఇరుక్కుపోయిన వాహనాన్ని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

పశ్చిమ డెల్టాకు 7,026 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి 7,026 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 276, బ్యాంక్ కెనాల్ 1,760, తూర్పు కాలువకు 479, పశ్చిమ కాలువకు 240, నిజాపట్నం కాలువకు 465, కొమ్మూరు కాలువకు 2,680 క్యూసెక్కులు, బ్యారేజీ నుంచి సముద్రంలోకి 3,28,125 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



జిల్లా అభివృద్ధిపై దివంగత నేత వైఎస్సార్ సంక్షేమ సంతకం చేశారు. వరాల జల్లు కురిపించారు. జల యజ్ఞంతో పంటలకు సాగునీరందించారు. ఉచిత విద్యుత్ ఇచ్చి వ్యవసాయాన్ని సులభతరం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంటుతో పేద, మధ్యతరగతి బిడ్డలను ఉన్నత చదువులు చదివించారు. ఆరోగ్యశ్రీతో పేదలకు ఉచిత వైద్యం అదించారు. లక్షల్లో ఖర్చయ్యే గుండె ఆపరేషన్లను సైతం రూపాయి ఖర్చు లేకుండా చేశారు. ఒకటా రెండా వందలాది సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు ఉరికించారు. పేద ప్రజల గుండెల్లో దేవుడిగా నిలిచారు.

సంక్షేమ శేఖరుడు

దివంగత వైఎస్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు

- ఆరోగ్యశ్రీతో పేదలకు వైద్యం
- ఫీజు రీయింబర్స్‌తో పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత చదువులు
- తీర ప్రాంత రైతులకు ఉచిత విద్యుత్
- నిజాంపట్నంలో సునామీ బాధితులకు పక్కా గృహాలు
- విజయవాడ నుంచి రేపల్లె వరకు కృష్ణా కరకట్ట నిర్మాణం
- అద్దంకిలో జలయజ్ఞం కింద సాగునీటి పథకాలు
- రూ.1100 కోట్లతో మేదరమెట్ల-నార్కెట్‌పల్లి రహదారి ఏర్పాటు
- దివంగత నేత వైఎస్సార్‌ను గుర్తు చేసుకుంటున్న జిల్లావాసులు
- నేడు వాడవాడలా వర్ధంతి వేడుకలు



కొత్తపాలెంలో నిర్మించిన సునామీ గృహాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాజశేఖరరెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ప్రత్యర్థులు సైతం శభాష్ అనిపించేలా పాలన సాగించిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి 2009 సెప్టెంబర్ 2న హెలికాప్టర్ ప్రమాదంతో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. భౌతికంగా దూరమైనా ఆయన ఇప్పటికీ తెలుగుజనం గుండెల్లో గుడి కట్టుకొన్నారు. ఆయన వారసుడిగా వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి గడచిన అయిదేళ్ల జనరంజక పాలన సాగించారు. అమ్మ ఒడి, రైతు భరోసా, ఉచిత పంటల బీమా, గిట్టుబాటు ధరలతో పాటు వందలాది సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించి జనం మన్ననలు పొందారు.

పేదల గుండెల్లో గూడు కట్టుకున్న దేవుడు

పేదల గుండెల్లో గూడుకట్టుకున్న దేవుడు దివంగత వైఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలు మంగళవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరగనున్నాయి. ఇందుకోసం వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా అన్ని నియోజకవర్గాల్లో దివంగతనేత విగ్రహాలకు క్షీరాభిషేకాలు నిర్వహించి పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నారు. అన్నదానాలు, రక్తదాన శిబిరాలను నిర్వహిస్తారు. ఆస్పత్రుల్లో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేయనున్నారు. వాడవాడలా వైఎస్ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా జరగనున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలతోపాటు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొననున్నారు.

బాపట్ల జిల్లా అభివృద్ధికి కృషి

జిల్లాకు వైఎస్ చేసిన మేలును జనం మరోమారు గుర్తు చేసుకుంటున్నారు. ఆయన పాలనలో బాపట్ల ప్రాంత అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు. అద్దంకి ప్రాంత అభివృద్ధి కోసం పెద్దఎత్తున పనులు చేపట్టారు. జలయజ్ఞంలో భాగంగా రూ. 70 కోట్లతో భవనాశి రిజర్వాయర్, రూ. 175 కోట్లతో ఎర్రం చినపోలిరెడ్డి పథకంతో పాటు కొరిశపాడు ఎత్తిపోతల పథకాలను చేపట్టారు. రూ. 1100 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో మేదరమెట్ల నుంచి నార్కెట్‌పల్లి వరకూ జాతీయరహదారిని నిర్మించారు. ఒంగోలు ప్రాంతంనుంచి హైదరాబాద్‌కు దగ్గర దారిని ఏర్పాటు చేసిన ఘనత దివంగత నేత వైఎస్‌దే.

అభివృద్ధికి 'మెచ్చు' తునకలు

- వేమూరు నియోజకవర్గం చుండూరులో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారు. జంపనిలో షుగర్ ఫ్యాక్టరీని టీడీపీ ప్రభుత్వం ప్రైవేటు పరం చేయగా, దివంగత వైఎస్ దాన్ని తిరిగి కో-ఆపరేటివ్ సెక్టార్‌లోకి తెచ్చారు. వీటితో పాటు నియోజకవర్గ అభివృద్ధికి పలు పథకాలు అమలు చేశారు.
- రేపల్లె నియోజకవర్గం నిజాంపట్నం మండలం కొత్తపాలెంలో మత్స్యకారులు, ఎస్టీలకు 120 పక్కా గృహాలు నిర్మించారు. రూ. 222 కోట్లతో విజయవాడ నుంచి రేపల్లె వరకూ కృష్ణానది పాడవునా కరకట్టను నిర్మించారు.
- రూ. 15 కోట్లతో బాపట్ల సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పరిధిలో ఫిల్టర్ బెడ్లు, పైపు లైన్లు నిర్మించారు. బాపట్లతో పాటు తీర ప్రాంతంలోని రైతులకు ఉచిత విద్యుత్ అందించడంతో రైతులు ఇసుక నేలల్లో మూడు పంటలు పండించుకుంటున్నారు.
- పర్చూరు నియోజకవర్గం కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మించారు. చినగంజాం ప్రాంతంలో అధికంగా ఉన్న ఉప్పు రైతులకు రూ. 1.05కే విద్యుత్ అందించారు.
- చీరాల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. రూ. 120 కోట్లతో చీరాల అభివృద్ధి, రూ.6 కోట్లతో హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించారు. చేనేత రుణాలు మాఫీచేసి అభయహస్తం అందించారు.



రూ. 1100 కోట్లతో నిర్మించిన మేదరమెట్ల - నార్కెట్‌పల్లి రహదారి



ఎర్రం చిన్న పోలిరెడ్డి ఎత్తిపోతల పథకంలోని గుండ్లకమ్మ వద్ద పంపు హౌస్



పెనుమూడి వద్ద కరకట్ట రోడ్డు నిర్మాణం



చుండూరులో నిర్మించిన గురుకుల పాఠశాల

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

అధికారులకు కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశం

బాపట్ల: ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించే దిశగా అధికారులు బాధ్యతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కొన్నింటికి తక్షణమే పరిష్కార మార్గం చూపించారు. కొన్నింటిని సంబంధిత శాఖ అధికారులకు అందించారు. ప్రతి సమస్యను చిత్తశుద్ధితో తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పత్రికల్లో వచ్చిన వార్తలపై ఆరా

పత్రికల్లో ప్రచురితమైన ప్రతికూల వార్తలపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ప్రశ్నించారు. వాటిపై వారు వివరణ ఇచ్చారు. ప్రతి గురువారం ఐవీఆర్ఎస్ ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీక్షణ సమావేశం నిర్వహిస్తారన్నారు. దీనికి సంబంధిత అధికారులంతా నివేదికలతో హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచే విధంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.

చెత్తను తగలబెడితే చర్యలు

గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు పంపకుండా వాటిని తగలబెట్టి పర్యావరణాన్ని కాలుష్యం చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. సేకరించిన తడి, పొడి చెత్తలను డంపింగ్ యార్డ్‌లో మాత్రమే ఉంచాలని, వాటిని ఎప్పటికప్పుడు జిందాల్ పరిశ్రమకు తరలించాలని ఆదేశించారు. చెత్తను రోడ్లకు ఇరువైపులా వేయడం, కాల్వలలో, కుంటల్లో పడవేయడం, తగులబెట్టడం చేస్తున్న గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కౌలు రైతులకు సహకరించాలి

జిల్లాలో కౌలు రైతులందరికీ సీసీఆర్సీ కార్డులు ఇచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. కార్డులు పొందిన రైతులకు రుణాల మంజూరులో బ్యాంకర్లు సహకరించడం లేదని పేర్కొన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహించి రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆయన డీఏఓ, ఆర్డీఓ, ఎంఏఓలను ఆదేశించారు. డ్రోన్ల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని, దాన్నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని, రాయితీ కూడా లభిస్తుందని తెలిపారు. ఇతర కంపెనీల నుంచి కొనుగోలు చేయకూడదని స్పష్టం చేశారు. డ్రోన్‌లు అవసరమైన ప్రభుత్వ శాఖలు ప్రతిపాదనలను తయారు చేసి జేసీకి అందజేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి. గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాల ఎంపిక జాబితా విడుదల

గుంటూరు మెడికల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ టెక్నీషియన్, మెడికల్ ఆఫీసర్, ఎఫ్ఎన్ఓ, సోషల్‌వర్కర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో తొలి విడత ఉద్యోగాలు ఇచ్చామని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. మిగిలిన పోస్టులకు ఆర్వోఆర్ ప్రకారం రెండో జాబితాను ఎంపిక చేశామని, వారి జాబితాను గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. జాబితాలోని అభ్యర్థులు మాత్రమే ఈనెల 3వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆమె సూచించారు.

పొదుపు మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: పొదుపు మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. డీఆర్‌డీఏ ద్వారా పాడి గేదెల పెంపకం యూనిట్ల అమలు తీరుపై సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పొదుపు మహిళలకు పాడి గేదెలు ఇవ్వడం ద్వారా పాల ఉత్పత్తి పెరిగి, ఆర్థిక అభివృద్ధిలోకి పయనిస్తారని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 70 వేల కుటుంబాలకు జీవనోపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 16వేల పొదుపు సంఘాలకు గేదెలు, మేకలు, గొర్రెలు యూనిట్లు స్థాపించాలన్నారు. మిగిలిన వారికి పౌల్ట్రీ, గడ్డి నాటడం వంటి యూనిట్లు మంజూరు చేయాలని ఆదేశించారు. డ్వాక్రా మహిళలు స్వయం ఉపాధితో లక్షాధికారులను చేయాలని ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వీటిల్లో ప్రధానంగా 12,500 గేదెల పెంపకం యూనిట్లు స్థాపించాలని చెప్పారు. ఈ యూనిట్లను స్థాపించడానికి సామాజిక పెట్టుబడి నిధి, శ్రీనిధి, ఉన్నతి పథకం, బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయం కల్పించాలని తెలిపారు. శ్రీనిధి కింద ఇప్పటికే రూ.260 కోట్ల రుణాలు జిల్లాకు కేటాయించినట్లు వివరించారు. ఇప్పటివరకు 72 గేదెల యూనిట్లను లబ్ధిదారులకు అందించామన్నారు. 25 అరకు కాఫీ సెంటర్లు జిల్లాలో ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. అద్దంకి నియోజకవర్గంలో 2,500 గేదెల యూనిట్లు, పర్చూరులో మూడువేల యూనిట్లు, చీరాలలో వెయ్యి యూనిట్లు, బాపట్లలో 1500, రేపల్లెలో 2000, వేమూరులో 2500 యూనిట్లు సమర్పించాలని లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. డిసెంబర్ చివరి నాటికి లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్, ఎల్‌డీఎం శివకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్

పింఛన్ల పంపిణీ సక్రమంగా చేపట్టాలి

పింఛన్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. బాపట్ల మండలం ఈతేరు గ్రామంలో ఆయన సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. సిబ్బంది సక్రమంగా పంపిణీ చేస్తున్నారా.. లేదా ?అంటూ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ల పంపిణీపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఇద్దరు వితంతు, వృద్ధులు, మంచం పట్టిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ సలీమా, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారిపై వేటు



- బార్లకు దరఖాస్తులు రాలేదని శిక్ష
- కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వర్లుకు ఆదేశం
- ఇన్‌చార్జి అధికారిగా ఎస్‌కే ఆయేషా బేగం నియామకం
- సర్కార్ తీరుపై సర్వత్రా ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాకు కేటాయించిన 19 బార్లకు మద్యం వ్యాపారులతో దరఖాస్తులు వేయించలేదన్న సాకుతో ఎక్సైజ్ ఉన్నతాధికారులు బాపట్ల జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వర్లుపై వేటు వేశారు. కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలంటూ సోమవారం ఆదేశించారు. దీంతో ఆయన హుటాహుటిన కమిషనరేట్‌లో రిపోర్టు చేశారు. ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా ఎక్సైజ్ అధికారి ఎస్‌కే. ఆయేషా బేగంను బాపట్ల ఇన్‌చార్జి ఎక్సైజ్ అధికారిగా నియమించారు. దీంతో ఆమె సోమవారమే విధుల్లో చేరారు. ఈ వ్యవహారం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ఎక్సైజ్ అధికారిపై వేటు వేయడంపై ఆ శాఖ ఉద్యోగుల్లో ఆందోళనతో పాటు ఆగ్రహం వ్యక్తమవుతోంది.

సిండికేట్‌గా మారిన వ్యాపారులు

పచ్చ బ్యాచ్‌తో కూడిన మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారారు. బార్ల లైసెన్సు, దరఖాస్తు ఫీజులను తగ్గించుకునేందుకు దరఖాస్తులు వేయకుండా బెదిరింపులకు దిగారు. ఎక్సైజ్ అధికారులు మొరపెట్టుకున్నా కనికరించలేదు. దీంతో బాపట్ల జిల్లాలోని బార్లకు నామమాత్రంగా కూడా దరఖాస్తులు పడలేదు. జిల్లాలో 17 జనరల్ కేటగిరీలో బార్లను మంజూరు చేయగా గీత కార్మికులకు మరో రెండు బార్లు కేటాయించారు. మొత్తం 19 బార్లకుగాను గీత కార్మికుల రెండు బార్లతోపాటు చీరాల, అద్దంకిల పరిధిలోని మరో రెండు బార్లకు మాత్రమే పూర్తిస్థాయిలో దరఖాస్తులు వేశారు. మిగిలిన 15 బార్లకు ఒక్క దరఖాస్తు కూడా పడలేదు. దీంతో ఆగ్రహం చెందిన ఎక్సైజ్ కమిషనరేట్ బాపట్ల జిల్లా ఎక్సైజ్ అధికారి విఫలమయ్యాడన్న సాకుతో ఆయన్ను సోమవారం కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించినట్లు సమాచారం. మద్యం వ్యాపారులు బార్లకు దరఖాస్తులు వేయకపోతే ఉన్నతాధికారులు జిల్లా ఎక్సైజ్ అధికారిపై వేటు వేయడంపై సిబ్బంది నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 2,400 గరిష్టం : రూ. 3,200

మోడల్ ధర రూ. 2,800

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	40,877
అమ్మకాలు	38,663
నిల్వ	7,718

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–14,200
నంబరు–5	10,000–13,400
341	10,000–15,300

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,200
నంబరు–5	10,000–13,500
341	11,000–15,500
4884	10,000–13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్–1	10,000 – 15,400
సంగీ బాడిగ 5531	10,000 – 14,600
ఆర్మూర్	9,800 – 12,200
తాలుకాయలు	6,200 – 7,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్–1	10,000 – 15,300
సంగీ బాడిగ 355	10,000 – 14,500
దువనూర్ డీలక్స్	10,500 – 13,500
తాలు	5,400 – 7,300

–కొరిటిపాడు (గుంటూరు)

క్లుప్తంగా

చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

గుంటూరు మెడికల్: ఏఆర్టీ, సరోగసి యాక్ట్ అమలుపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. గుంటూరు జిల్లాలో ఇప్పటివరకు 27 హాస్పిటళ్లు ఏఆర్టీ, సరోగసి యాక్ట్‌లో రిజిస్టర్ అయి ఉన్నాయన్నారు. చట్టానికి లోబడి ఉండాల్సిన బాధ్యత 27 ఆసుపత్రుల యాజమాన్యాలపై ఉందన్నారు. తనతోపాటు ప్రోగ్రాం ఆఫీసర్లు తరచుగా ఈ ఆసుపత్రులను తనిఖీ చేస్తారని తెలిపారు. ఎక్కడైనా నిబంధనలు పాటించకపోతే వారిపై కేసు నమోదు చేసి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రిజిస్టర్ల నిర్వహణ, ధరల పట్టికలు డిస్ ప్లే చేయడం తప్పనిసరి అని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించినట్లు తెలిస్తే ఆయా ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిమజ్జనంలోనూ కూటమి రాజకీయ కుట్ర

వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై దాడి


రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

చుండూరు(వేమూరు) : కూటమి నేతలు రాజకీయ కుట్రతో వినాయకుడి నిమజ్జనంలోనూ వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై దాడి చేశారు. చుండూరు మండలంలోని కేస్‌పల్లిలో ఆదివారం నిర్వహించిన విగ్రహం ఊరేగింపులో కూటమి నాయకులు రోడ్డు వద్ద కాపు కాసి దాడులకు పాల్పడ్డారు. కూటమి నాయకుల నుంచి తమకు ప్రాణ రక్షణ కల్పించాలని బాధితులు సోమవారం రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. కూటమి నాయకులకు చుండూరు సీఐ శ్రీనివాసరావు పూర్తిగా కొమ్ము కాయడంతో దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దాడుల్లో నష్టపోయామంటూ ఏడు కుటుంబాలు కలసి సీఐ, కూటమి నాయకులపై సోమవారం ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు.

సర్పంచ్ హత్యకు కుట్ర

గ్రామ సర్పంచ్ అంగిరేకుల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేస్‌పల్లిలో వైఎస్సార్ సీపీ ప్రాబల్యం ఎక్కువగా ఉందని, పార్టీ లేకుండా చేసేందుకు తనను హత్య చేసేందుకు కూటమి నాయకులు కుట్రలో భాగంగా దాడి చేసినట్లు ఆరోపించారు. విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ జెండాలు ఉండటంతో సీఐ శ్రీనివాసరావు పిలిపించారని, జెండాలు, పాటలు పెట్టితే బెయిల్ రాకుండా కేసులు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. విగ్రహం తీసుకొని వెళుతుండగా కొత్తపల్లి గ్రామం వద్ద గుమ్మ రఘు వర్గీయులు రోడ్డుకు అడ్డంగా బైక్‌లు పెట్టారని వివరించారు. బైక్ తీయాలని అడిగితే రఘు వర్గీయులు చుండూరు గ్రామానికి చెందిన బాలకోటిరెడ్డికి ఫోన్ చేసి చెప్పారని తెలిపారు. ఆయన మూడు కారుల్లో కొంత మంది వ్యక్తులను తీసుకొని వచ్చి ట్రాక్టరులో ఉన్న మహిళలపై దాడులు చేశారని నాగేశ్వరరావు ఆరోపించారు. మెడలో ఉన్న బంగారం కూడా లాక్కొన్నారని చెప్పారు. సీఐ శ్రీనివాసరావు కూటమి నాయకులకు వత్తాసు పలకడంతో బాలకోటిరెడ్డి తనను హత్య చేసేందుకు ప్రయత్నం చేశారని, దాన్నుంచి తప్పించుకున్నట్లు ఆరోపించారు. సీఐ వల్ల వైఎస్సార్ సీపీ నాయకులకు ప్రాణ హాని ఉందని, రక్షణ లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు బాధితులు పాల్గొన్నారు.

గోవా సంస్కృతి బాపట్లకు తేవద్దు!

- శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతి శివ స్వామీజీ
- సూర్యలంక తీరం అధ్యాత్మికం, పర్యాటకంగా ప్రసిద్ధి చెందిన ప్రాంతం
- విష సంస్కృతికి బీజాలు
- అడ్డుకునేందుకు పోరాటం


మాట్లాడుతున్న పీఠాధిపతి శివ స్వామీజీ

బాపట్ల టౌన్: పర్యాటకం, అధ్యాత్మికంగా ఎంతో ప్రసిద్ధి చెందిన సూర్యలంక తీరంలో గోవా తరహాలో విష సంస్కృతి తీసుకు వస్తే చూస్తూ ఊరుకునేది లేదని శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామీజీ తెలిపారు. పట్టణంలోని విశ్వహిందూ పరిషత్ స భ్యుడు ప్రతాప్‌కుమార్ నివాసంలో సోమవారం వి లేకరులతో మాట్లాడారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 14న హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళనం నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హిందూ న్యాయవాదులను ఆహ్వానించే కార్యక్రమంలో భాగంగా సోమవారం బాపట్లకు వచ్చారు. శివ స్వామీజీ మాట్లాడుతూ ఇటీవల వార్తల్లో బాపట్ల సూర్యలంక సముద్రతీరాన్ని మినీ గోవా తరహాలో అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటనలు వచ్చాయని, వాటిని చూసి చాలా బాధ కలిగిందని తెలిపారు. సహజసిద్ధంగా ఏర్పడిన సూర్యలంక తీరం అటు పర్యాటకంగా, ఇటు అధ్యాత్మికంగా ఎంతో అభివృద్ధి చెందిన ప్రాంతమని పేర్కొన్నారు. కార్తిక మాసంలో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తీరానికి లక్షల్లో తరలి వస్తున్నారని పేర్కొన్నారు. పుణ్య స్నానాలు అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు వీలుగా తీరంలో తారకేశ్వరస్వామి, ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆధ్యాత్మికంగా ఉన్న ప్రాంతంలో విష సంస్కృతికి బీజాలు నాటే నిర్ణయాలను తిప్పికొడుతామని చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తీరంలో చెడు సంస్కృతి అవకాశం లేకుండా చేస్తామని తెలిపారు. అప్పటికీ మారకపోతే న్యాయపోరాటం చేయటానికైనా వెనుకాడేది లేదని స్వామీజీ స్పష్టం చేశారు. సమావేశంలో విశాఖపట్టణం అడ్వకేట్ కె. రవిశంకర్, బాపట్ల బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు విన్నకోట సత్యప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రి ఎదుటే తమ్ముళ్ల బాహాబాహి

జే.పంగులూరు: నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోంది. మంత్రిగారి ఇలాఖాలో పార్టీని ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఏకంగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముందే బాహాబాహికి దిగారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమం జరుగుతుండగా నూజిళ్లపల్లి గ్రామానికి చెందిన రెండు తెలుగుదేశం పార్టీ గ్రూపులు మంత్రి ఎదుట బాహాబాహీకి దిగాయి. గ్రామంలో ఆధిపత్యం కోసం గొడవడ్డారు. ఈ క్రమంలో ఒకరినొకరు తోసుకుంటుండగా మంత్రి కలుగజేసుకొని, సర్ది చెప్పారు. అయినా కూడా నేతలు వినలేదు. కార్యక్రమం అనంతరం మంత్రి వెళ్లగానే మళ్లీ గొడవకు దిగారు. ఈ తతంగాన్ని చూసి అక్కడ ఉన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామపెద్దలు నివ్వెరపోయారు. ఆఖరుకు పాఠశాలలో కూడా పార్టీ గోల ఏమిటని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ ఉన్న నాయకులు కల్పించుకొని సర్ది చెప్పారు.

సత్తెనపల్లి సబ్‌జైలులో రిమాండ్ ఖైదీకి గాయాలు

సత్తెనపల్లి: రిమాండ్ ఖైదీకి గాయాలైన సంఘటన సత్తెనపల్లిలోని సబ్‌జైల్‌లో సోమవారం జరిగింది. రాజుపాలెం అనుపాలేనికి చెందిన మెర్నేటి గోపీకృష్ణ దేవాలయాల దొంగతనం కేసులో 45 రోజుల కిందట రిమాండ్ ఖైదీగా సత్తెనపల్లి సబ్ జైలుకు వచ్చాడు. సోమవారం బాత్రూమ్ దగ్గర టైల్స్ పై జారీ పడి గాయంకావడంతో సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స నిమిత్తం సబ్‌జైలు సిబ్బంది తీసుకెళ్లారు. గోపీకృష్ణ ఆత్మహత్యకు యత్నించే క్రమంలో చెయ్యి కోసుకోగా 25 కుట్లు పడినట్లు సమాచారం.

నిండుకుండలా టెయిల్‌పాండ్ రిజర్వాయర్

పులిచింతలకు 3,41,297 క్యూసెక్కులు విడుదల



సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి 19 క్రస్ట్‌గేట్లు ద్వారా 3,41,297 క్యూసెక్కులు పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం సోమవారం తెలిపారు. టెయిల్ పాండ్ రిజర్వాయర్ నిండుకుండలా ఉందన్నారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు రిజర్వాయర్ 19 క్రస్ట్‌గేట్లు 3.50 మీటర్లు ఎత్తు ఎత్తి 3,41,297 క్యూసెక్కులు దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు నీటి మట్టం 75.50 మీటర్లకు గాను 74.47 మీటర్లకు నీరు చేరుకుందన్నారు. రిజర్వాయర్ గరిష్ట సామర్థ్యం 7.080 టీఎంసీలకుగాను ప్రస్తుతం 6.389 టీఎంసీలు ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 62.08 మీటర్లకు చేరుకుందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోని రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు వెల్లడించారు. నాగార్జునసాగర్ నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు.

రిజిస్టర్ పోస్టు 'సర్వీసుకు' స్వస్తి

సత్తెనపల్లి: అత్యంత పురాతన ప్రభుత్వ రంగ సంస్థ పోస్టల్. ఎప్పుడో బ్రిటిష్ కాలంలో ప్రారంభమైన తపాలా వ్యవస్థ ఇప్పటికీ పటిష్టంగా కొనసాగుతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త పుంతలు తొక్కుతోంది. సంస్కరణల్లో భాగంగా 'రిజిస్టర్ పోస్టు' సర్వీసుకు స్వస్తి పలికింది. 171 ఏళ్ల సేవలందిస్తున్న రిజిస్టర్ పోస్టు సర్వీసును ఆగస్టు 30తో నిలిపివేశారు. దీనిని స్పీడ్ పోస్ట్‌లో విలీనం చేశారు. దేశవ్యాప్తంగా నడుస్తున్న పోస్టల్ కార్యాలయాల్లో ఈ విధానం అమల్లోకి వచ్చింది. ఇప్పటికే పోస్టల్ వినియోగదారులకు నాణ్యమైన సులభతరమైన సేవలు అందించ టానికి నూతన సాఫ్ట్‌వేర్‌ను అమలు చేస్తున్నారు. అందులో భాగంగానే రిజిస్టర్ పోస్టు సేవలకు సెలవు ప్రకటించారు. ఈ సేవలను రద్దుచేసి స్పీడ్ పోస్ట్ ద్వారా స్థానికంగా అయితే అదే రోజు, ఇతర ప్రాంతాలకు మరుసటి రోజు చేరే విధంగా చర్యలు చేపడుతున్నారు. దీంతో పౌర సేవలు వేగవంతం సులభతరం అవుతాయని తపాలా శాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ ఒకటి నుంచి స్పీడ్ పోస్ట్ విధానం మాత్రమే అందుబాటులోకి రానుంది.

గ్రానైట్ లారీలు స్వాధీనం


కారెంపూడి పోలీస్ స్టేషన్ బయట ఉన్న గ్రానైట్ లారీలు

కారెంపూడి: గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న ఎనిమిది లారీలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తనిఖీలు చేసి సరైన బిల్లులు లేకపోవడంతో వాటిని కారెంపూడి పోలీస్‌స్టేషన్ అధికారులకు ఆదివారం రాత్రి అప్పగించారు. ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్నారని గుర్తించిన అధికారులు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రకాశం జిల్లా చీమకుర్తి నుంచి గ్రానైట్‌తో లారీలు మహారాష్ట్రకు వెళ్తున్నాయి. వాటిలో సరుకు విలువను బట్టి ఒక్కొక్క లారీకి రూ.2.5 లక్షల దాకా జరిమానా విధించే అవకాశం ఉందని ఆ శాఖ అధికారి ఒకరు తెలిపారు. నరసరావుపేట రహదారిలో జూలకల్లు సమీపంలోను, కారెంపూడి సమీపంలోను కొన్ని లారీలను అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

జీజీహెచ్‌లో నకిలీ డాక్టర్ హల్‌చల్

పోలీసులకు పట్టించిన సూపరింటెండెంట్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ పిల్లల వైద్య విభాగంలో డాక్టర్ మాదిరిగా ఓ మహిళ యాప్రాన్, సెతస్కోప్ ధరించి చికిత్సలు చేసేందుకు హడావుడి చేయడంతో పట్టుపడిపోయింది. గుంటూరుకు చెందిన జ్యోతి గతంలో పిల్లల విభాగంలో తన పిల్లలకు చికిత్స చేయించేందుకు కొన్ని రోజులపాటు ఉంది. రెండు రోజులుగా ఆసుపత్రిలో డాక్టర్ మాదిరిగా రౌండ్స్ వేస్తూ పిల్లలకు చికిత్స చేసేందుకు హడావుడి చేస్తుండటంతో వార్డుల్లో తనిఖీలు చేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణకు అనుమానం వచ్చి ఆరా తీశారు. ఆమె పొంతనలేని సమాధానాలు చెప్పడంతో తక్షణమే పోలీసులకు అప్పజెప్పారు. ఆమె వెంట మరో వ్యక్తి ఉండి అచ్చం డాక్టర్ మాదిరిగా వార్డుల్లో హడావుడి చేస్తున్నాడని, అకృత్యాలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉండటంతో తక్షణమే పోలీసులకు అప్పగించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రమణ తెలిపారు.

పేరుగొప్ప.. ఊరు దిబ్బగా ప్రైవేటు వర్సిటీలు

మంగళగిరి టౌన్: అమరావతి రాజధాని పరిధిలో వున్న పలు యూనివర్సిటీల్లో ఫీజులు రూ.లక్షల్లో ఉంటున్నాయని, కానీ వసతులు అంతంతమాత్రంగా ఉన్నాయని, పేరు గొప్ప.. ఊరు దిబ్బగా అవి ఉంటున్నాయని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ఎద్దేవా చేశారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం రాత్రి పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. నేతాజీ మాట్లాడుతూ అమరావతి రాజధాని పరిధిలో విట్, ఎస్ఆర్ఎం, ఇతర యూనివర్సిటీలలో విద్యార్థులు రూ.లక్షలు ఫీజులు చెల్లించి చదువుకుంటున్నారని, వారికి మాత్రం నాణ్యత లేని అపరిశుభ్రమైన ఆహారాన్ని అందిస్తున్నారని విమర్శించారు. 15 రోజుల క్రితం విట్ యూనివర్సిటీలో ఆహారం సరిగా లేదంటూ విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళన చేశారని, అది మరువక ముందే ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారంటూ విద్యార్థులు ఆందోళనకు దిగడం యాజమాన్యాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆహార పదార్థాలను తనిఖీ చేసే అధికారులను నియమించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పూలింగ్ చట్టంలో ఉన్న విధంగా రాజధానిలో నిర్మించిన విశ్వవిద్యాలయాల్లో ఆ ప్రాంత విద్యార్థులకు రాయితీలు అమలు చేయాల్సి ఉన్నప్పటికీ అమలు కావడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఆయా యూనివర్సిటీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని నేతాజీ డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, పట్టణ కార్యదర్శి వీవీ జవహర్ లాల్, సీనియర్ నాయకులు జేవీ రాఘవులు, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కమలాకర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ
- 57 మంది బాధితుల నుంచి అర్జీల స్వీకరణ


బాధితుల సమస్యలు అడిగితెలుసుకుంటున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 57 మంది బాధితులు వచ్చి తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలన్నారు. అర్జీలను చట్ట పరిధిలో వేగవంతంగా విచారించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీదారుల సమస్యను పరిష్కరించడానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, పి.జి.ఆర్.ఎస్ సెల్ ఎస్ఐ ఏ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భర్త నుంచి ప్రాణహాని



నాకు తొమ్మిదేళ్ల కిందట కాకుమాను మండలం కొండపాటూరు గ్రామానికి చెందిన మామిడి పవన్‌తో వివాహం జరిగింది. నాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెళ్లి సమయంలో మా తల్లిదండ్రులు కట్నం, బంగారం ఇచ్చారు. పెళ్లి అయిన తర్వాత బిజినెస్ చేస్తానంటే భర్త మాటలు నమ్మాను. నా పేరుతో ఉన్న దస్తావేజులను బ్యాంకులో పెట్టి రూ.5 లక్షలు అప్పు తీసుకొచ్చి ఇచ్చాను. డబ్బులు తీసుకొని వెళ్లిపోయాడు. ప్రతినెలా బ్యాంకుకు ఈఎంఐ చెల్లిస్తానని చెప్పి చెల్లించడం లేదు. ఇదేమని అడిగితే నిన్ను చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడు. నాకు భర్త వల్ల ప్రాణహాని ఉంది. రక్షణ కల్పించాలి.

– మామిడి దీపిక, పేరలి, కర్లపాలెం మండలం

ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదు



మా గ్రామానికి చెందిన కారంపూడి శివనాగమల్లేశ్వరరావు, ఆయన భార్య దుర్గామల్లీశ్వరి, కారంపూడి ఈశ్వర్‌కుమార్, ఆయన భార్య కరుణలు నాపై అకారణంగా తరచూ దాడులు చేస్తూ నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై ఆధారాల సహా ఆగస్టు 19న భట్టిప్రోలు ఎస్ఐకి ఫిర్యాదు చేశాను. పది రోజులైనా ఎస్ఐ నా కేసు గురించి పట్టించుకోవడం లేదు. స్టేషన్‌కు వెళితే అసలు సమాధానం చెప్పడం లేదు.

– చిలకాల సాంబ్రాజ్యం, భట్టిప్రోలు

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్‌లో పందిళ్లపల్లి విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వేటపాలెం: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్‌లో పందిళ్లపల్లి విద్యార్థి ప్రతిభ చాటాడు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం యతిన్ కార్తికేయ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించాడని హెచ్‌ఎం తలమల దీప్తి సోమవారం తెలిపారు. ఈ నెల 29, 30వ తేదీల్లో భీమవరంలో 11వ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లో రాణిస్తున్నారన్నారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కర్ణ నాగేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లు, స్టాఫ్ సెక్రటరీ బుద్ధి మోహన్‌రావు, లలిత పరమేశ్వరి, శ్రీనివాసరావు, భవానీ దేవి, సూర్యనారాయణ, బ్రహ్మయ్య, ప్రసన్నాంజనేయులు, రాజా పాల్గొన్నారు.

అధికార పార్టీ సభలకు డ్వాక్రా మహిళలు

- అధికారులకు పచ్చ నేతల హుకుం జారీ
- రాకపోతే బెదిరింపులు

సాక్షి టాస్క్ ఫోర్స్: స్వయం ఉపాధిలో ఏళ్లుగా దేశానికి ఆదర్శంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ డ్వాక్రా మహిళలు, ఇప్పుడు అధికార పార్టీ సభలకు ప్రధాన వీక్షకులుగా మారుతున్నారు. ఆ సభతో ఎలాంటి సంబంధం లేకున్నా సరే, వారు తప్పనిసరిగా రావాల్సిందే ! లేదంటే సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని పచ్చ నేతలు బెదిరిస్తారు. రుణాలు రాకుండా చేస్తామని హెచ్చరిస్తారు. మహిళలను తీసుకురాని అధికారులను, లక్ష్యాలకు చేరుకోలేదని వేధిస్తారు. ఈ నేపథ్యంలో అధికార పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలంటేనే డ్వాక్రా మహిళలు, సంబంధిత అధికారులు బెంబేలెత్తిపోతున్నారు.

బలవంతంగా తరలింపు

ముఖ్యమంత్రి మొదలుకుని, మంత్రులు, ఎమ్మెల్యేల సభలు, సమావేశాలకు సోమవారం పిడుగురాళ్లలో జరిగిన సభకు డ్వాక్రా మహిళల్ని బలవంతంగా తరలిస్తున్న తీరు పలు విమర్శలకు దారి తీస్తోంది. డ్వాక్రా సంఘాలను మీటింగ్‌కు తీసుకురావాలంటూ ఏపీఎం, సీసీ, యానిమేటర్ ఇల్లిల్లు తిరిగి తప్పక రావాలంటూ హుకుం జారీ చేశారు. డ్వాక్రా సంఘాల మహిళలను అధికార పార్టీ రాజకీయ సభలకు తరలివచ్చే ముడిసరకుగా మార్చేసింది. ఊరూ, మండలం, జిల్లా, రాష్ట్రం ఎక్కడ సభలున్నా ఆటోల్లో, వ్యాన్లలో కుక్కేసి తెస్తున్నారు. రానని మొండికేశారో ఇక అంతే సంక్షేమ పథకాలు కోతేస్తామని బెదిస్తున్నారు. పోనీ ఎగ్గొడదామా అంటే ఎవరు వచ్చారో, ఎవరు రాలేదో నోట్ చేసుకుంటాం? లేదంటే సభ వద్ద సెల్ఫీ తీసుకుని ఆ ఫొటోను వాట్సాప్ ద్వారా గ్రామ నాయకులకు ఫోటోలు పంపుతున్నారు. అంగన్‌వాడీ టీచర్లకు మీటింగ్‌కు హాజరుకావాలని సీడీపీఓ నుంచి గ్రూపుల్లో మెసేజ్‌లు వచ్చాయి. ప్రతి ఒక్కరూ సోమవారం సాయంత్రం జరిగిన నాలుగు గంటలకు పిడుగురాళ్లలోనే జానపాడు రోడ్డులో జరిగే స్త్రీ శక్తి పథకం విజయోత్సవం సభకు హాజరుకావాలని అందులో సందేశం.

కక్షపూరితంగా తొలగించారు

- శ్రీ సత్యసాయి స్వయం సహాయక సంఘ సభ్యురాలు మైనేని స్రవంతి
- వైఎస్సార్ సీపీలో క్రియాశీలకంగా భర్త వ్యవహరిస్తున్నారని కక్ష


తహసీల్దార్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తున్న స్రవంతి

పెదకూరపాడు : తనను కక్షపూరితంగా తొలగించారని శ్రీ సత్యసాయి స్వయం సహాయక సంఘ సభ్యురాలు మైనేని స్రవంతి వాపోయారు. తన భర్త మైనేని ప్రతాప్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పల్నాడు జిల్లా పార్టీ యువజన విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఉన్నారని కక్షపూరితంగా తనను శ్రీ సత్య సాయి స్వయం సహాయక సంఘం నుంచి అన్యాయంగా తొలగించారని వాపోయారు. ఈ మేరకు మండలంలోని లగడపాడు గ్రామానికి చెందిన మైనేని స్రవంతి తహసీల్దార్ ధనలక్ష్మికి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. గత పది సంవత్సరాల నుంచి సంఘం సభ్యురాలుగా నిబద్ధతతో వ్యవహరించానని తెలిపారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లింపులు చేశానని, తాము వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నామని తొలగించడం దారుణమని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. స్వయం సహాయక సంఘాలపై కూడా రాజకీయాలు ఏమిటని ఆమె ప్రశ్నించారు. సంబంధిత అధికారులు విచారణ చేపట్టి న్యాయం చేయాలని స్రవంతి కోరారు.

ఎయిడెడ్ అధ్యాపకుల జీవితాల్లో వెలుగులు నింపిన మాణిక్యరావు

మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

చిలకలూరిపేట: ఎయిడెడ్ అధ్యాపకుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత దివంగత ఎంజే మాణిక్యరావుకు దక్కుతుందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చెప్పారు. పూర్వ ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడు, ఆప్టా నాయకుడు దివంగత ఎంజే మాణిక్యరావు శతజయంతిని పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో రిటైర్డ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగభద్రత లేక బానిసల మాదిరి జీవితాలు గడుపుతున్న ఎయిడెడ్ కళాశాల లెక్చరర్ల జీవితాలను చూసి 1972లో రాష్ట్ర వ్యాప్త సమ్మె పిలుపునిచ్చారని తెలిపారు. సమ్మె ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎయిడెడ్ కళాశాలల అధ్యాపకులకు ఉద్యోగభద్రత, పెన్షన్ విధానం గవర్నమెంట్ లెక్చరర్లతో సమానంగా లభించాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంజే మాణిక్యరావు మెమోరియల్ కమిటీ కార్యదర్శి డాక్టర్ మోజస్, రిటైర్డ్ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శు లు కేవీ కృష్ణారావు, జీఆర్‌కే రెడ్డి, జీవీ రాఘవులు, తోటకూర వెంకటనారాయణ, టి వెంకటేశ్వరరావు, ఎం లక్ష్మీనారాయణ, పీఎస్వీ ప్రసాద్, కె రామారావు, ఆళ్ల వేమనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.